
సాక్షి ఒడిశా

బుధవారం । 10 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,84,548
బంగారం 60 మిల్లీ గ్రాములు
వెండి 149 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యం

రాష్ట్రంలో పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యమవుతుందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు.

- 8లో



సింపోజియం ప్రారంభం

భువనేశ్వర్‌లోని జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ(నైజర్) పఠాణి సామంత ఆడిటోరియంలో మొక్కల ఫొటో బయాలజీ అంతర్జాతీయ సింపోజియం మంగళవారం ప్రారంభమైంది.

- 8లో

కొత్తగా రెక్కలొచ్చెనే..!



• మల్కన్‌గిరి ఎయిర్‌పోర్టు ప్రారంభం



నూతన ఎయిర్‌పోర్టు వద్ద సీఎం నవీన్ పట్నాయక్



విమానాశ్రయం ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



సీఎంకు స్వాగతం పలుకుతున్న గిరిజన కళాకారులు



ఎయిర్‌పోర్టులో ఎగరడానికి సిద్ధంగా ఉన్న విమానం



ఎయిర్‌పోర్టు పరిశీలిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

మల్కన్‌గిరి: ఒకప్పుడు మావోయిస్టు కంచుకోటగా పిలువబడిన మల్కన్‌గిరి జిల్లా ప్రస్తుతం అభివృద్ధి పథంలో కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుండడంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఇదివరకు ఈ ప్రాంతానికి హెలీకాప్టర్ వచ్చింది అంటే మావోయిస్టులు ఏదో ఘాతుకానికి పాల్పడడంతో అధికారులు వస్తున్నారని స్థానికులు భావించేవారు. కానీ ప్రస్తుతం ఈ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా మంగళవారం ప్రారంభించారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎంకు ఆదివాసీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు సైతం సీఎం శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా ఖోయిర్‌పుట్ సమితి గోవిందపల్లి గ్రామం వద్దనున్న సప్తధర ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేశారు. అలాగే స్వాభిమాన్ ఏరియాలో మరో మూడు వంతెన నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి టుకుణి సాహు, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్, బీజేడీ రాష్ట్ర ప్రత్యేక గిరిజన అభివృద్ధి మండలి అధ్యక్షుడు ప్రదీపమాఝి, కలెక్టర్ విశాల్ సింగ్, ఎస్పీ నితీష్ వాద్వానీ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మడ్కామి, నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి, మల్కన్‌గిరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టాంగులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

వేంకటేశ్వరునికి పొన్నాకుల హారతి



స్వామివారికి హారతి ఇస్తున్న రాంజీ ఆచార్యులు

రాయగడ: ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలతో పాటు అత్యంత ప్రీతికరమైన పొన్నాకుల్లో హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ ఎస్.బురుడి గ్రామంలో కల్తీ పిండితో తయారుచేసిన చిరుతిండ్లు తినడం వల్ల ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే వారిని పర్లాకిమిడి మెడికల్ ఆస్పత్రికి తరలించారు. గత రాత్రి ఎస్.బురుడి గ్రామంలో పకోడి తినడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారని డీఎంవో డాక్టర్ ప్రమోద్ కుమార్ పండా తెలిపారు.

82 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టైన నిందితులను చూపిస్తున్న అధికారులు

బరంపురం: జిల్లాలోని దిగపండి నుంచి బరంపురం వైపు ఒక కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు హింజికాట్, దిగపండి, బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఫస్ట్‌గేట్ దగ్గరనున్న రామకృష్ణ పెట్రోల్ బంకు దగ్గర కారుపై ఎక్సైజ్ అధికారులు దాడిచేసి 4 బస్తాల్లో తరలిస్తున్న 82 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో పశ్చిమ బెంగాల్ మిదనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా, బిశ్వాజిత్ దాస్‌లుగా గుర్తించారు. అరెస్టైనవారి దగ్గర నుంచి రూ.17 వేల నగదు సైతం సీజ్ చేసినట్లు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదానికి గురైన భవనం



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన బైక్‌లు

జయపురం: స్థానిక పారాబెడలో సోమవారం అర్ధరాత్రి మూడంతస్తుల భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో భవనంలో నివాసముంటున్నవారు ఒక్కసారిగా ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. అయితే స్థానికులు వెంటనే అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా, వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ భవనం రమేష్ బెహర అనే వ్యక్తికి సంబంధించినది. ప్రమాదంలో నాలుగు ద్విచక్ర వాహనాలు, కొంత ఆస్తి నష్టం జరిగింది.

‘డ్రైవర్లను హంతకులుగా చిత్రీకరిస్తున్నారు’



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త హిట్ అండ్ రన్ చట్టంతో దేశాభివృద్ధిలో భాగస్వాములైన డ్రైవర్లను హంతకులుగా చిత్రీకరిస్తున్నారని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక యాదవ భవనంలో జగత్ జననీ పికప్ మోటార్ కర్మచారి సంఘం ఆధ్వర్యంలో డ్రైవర్ల సంఘాల సంయుక్త సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిప్పులు కురిపించారు. మోదీ ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చి డ్రైవర్లలో భయాందోళనలు కల్పిస్తోందని దుయ్యబట్టారు. ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో సమర్పిస్తూ హోం మంత్రి అమిత్ షా అతి చతురితతో మాట్లాడారని మండిపడ్డారు. అతడి దృష్టిలో డ్రైవర్లు మనుషులను చంపేందుకు వాహనాలు నడుపుతున్నారా అని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగితే ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, పలు ప్రమాదాల్లో డ్రైవర్లు సైతం మరణిస్తున్నారని గుర్తు చేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జుదిష్టర్ రౌళో మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన భువనేశ్వర్‌లో జరగనున్న డ్రైవర్ల సంఘ ఫెడరేషన్ ఏర్పాటులో పాల్గొనేందుకు జయపురం నుంచి ఐదుగురు సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో ఆటో, వ్యాన్, కారులు, జీపుల, ట్రక్కులు, బస్సుల డ్రైవర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మోటారు సంఘాల ప్రతినిధులు

ఓఎంసీకి ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న బల్వంత్ సింగ్


భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ సంస్థ(ఓఎంసీ)కి ప్రతిష్టాత్మక రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ – 2023 లభించింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఓఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ బల్వంత్ సింగ్ ఈ పురస్కారం మంగళవారం అందుకున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా క్రీడలను ప్రోత్సహించినందుకు ఆ సంస్థకు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం లభించడం విశేషం. ఓఎంసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా వివిధ స్థాయిల్లో క్రీడలను ప్రోత్సహిస్తోంది. హాకీ ఇండియాతో వారి భాగస్వామ్యం జట్టు శిక్షణ, పరికరాలు, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనేందుకు వారికి తోడ్పడటానికి వీలు కల్పిస్తోంది. యువత కోసం క్రీడలు – భవిష్యత్ కోసం యువత నినాదంతో రాష్ట్రంలో క్రీడల సమగ్ర అభివృద్ధి కోసం మద్దతునిచ్చింది. ఈ సంస్థ గత 5 ఏళ్లలో హాకీ ఇండియా అభివృద్ధికి గణనీయంగా దోహదపడి, దేశంలో హాకీ దీర్ఘకాలిక అభివృద్ధికి రాబోయే 10 ఏళ్లపాటు కట్టుబడి ఉండేందుకు ముందుకు రావడం విశేషం. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి నికర లాభంలో 3 శాతం సహకారం అందిస్తోంది. ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ 12 మంది క్రీడాకారులకు ఉపాధి కల్పించింది. వర్ధమాన క్రీడాకారులకు మద్దతు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిని సులభతరం చేసి స్థానిక ఔత్సాహికుల్లో క్రీడా ప్రతిభకు పదును పెడుతోంది.

పర్యాటక కేంద్రంగా పుత్తగోర కోట

• రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు
• గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా





శ్మశాన స్థూపాలు

బరంపురం: గంజాం పట్టణంలోని అతి పురాతనమైన పుత్తగోర కోటను పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా తెలియజేశారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పర్యాటక అభివృద్ధి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బరంపురం నగరానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి పురాతన పుత్తగోర కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా పర్యాటక అభివృద్ధి సంస్థ (ఓటీడీసీ) ఆధ్వర్యంలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళిక బోర్డు చైర్మన్ రామచంద్ర పండా మాట్లాడుతూ చరిత్రాత్మకమైన గోల్‌కొండ కోట, ఫ్రెంచ్ కోట, బ్రిటీష్ కోటలకు ఉన్నంత చరిత్ర పుత్తగోర కోటకి ఉన్నట్లు పురావస్తు పరిశోధన శాస్త్రవేత్తలు తెలియజేశారని వెల్లడించారు. ఇక్కడి పురావస్తు కళలు చూస్తే ఒడిశా రాష్ట్ర రాజరిక పాలన, సాంస్కృతిక సాంప్రదాయ, సామాజిక స్థితిగతులను అర్థం చేసుకోవచ్చన్నారు. అభివృద్ధి జరిగితే పుత్తగోర దేశంలోనే మంచి పర్యాటక కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏడీఎం కబింద్ర కుమార్ సాహు, రాష్ట్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ సంఘమిత్ర సత్‌పతి, డైరెక్టర్ అశ్విని సత్‌పతి, గంజాం బీడీవో ప్రదీప్ కుమార్ పండా, జిల్లా పర్యాటక అధికారి సనాతన్ నాయక్, జిల్లా సాంస్కృతిక అధికారి సుకురు స్వాయి, గంజాం ఎన్ఏసీ అధికారి రామచంద్ర మిశ్రా, ఐఐసీ అనిల్ మహంతి, తహసీల్దార్ అబని కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.





పుత్తగోర కోట



అప్పట్లో కోటలో సైనికులు ఉండే గదులు



కోట పక్కనే ఉన్నటువంటి రుశికుల్య నది

విజిలెన్స్ వలలో ఏఎస్ఐ



ఏఎస్ఐ అనిల్‌కుమార్

జయపురం: పట్టుబడిన స్కూటీని విడిచిపెట్టేందుకు రూ.5 వేల లంచం అడిగిన పట్టణ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ అనిల్‌కుమార్ నాయక్‌తో పాటు ఆ డబ్బు తీసుకునేందుకు అతను నియమించిన దుప్పట్ల వ్యాపారి మహ్మద్‌ను విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పాయిక వీధికి చెందిన రింఖస గౌడ స్కూటీని తగిన ధ్రువపత్రాలు లేకపోవడంతో పోలీసులు పట్టుకున్నారు. దీంతో ధ్రువపత్రాలు చూపించి తన స్కూటీని అప్పగించాలని గౌడ కోరగా, రూ.5 వేలు లంచం ఇస్తేనే విడుదల చేస్తానని ఏఎస్ఐ స్పష్టం చేశాడు. ఇక చేసేదేమీలేక రింఖస విజిలెన్స్ కార్యాలయానికి వెళ్లి విషయం తెలియజేశాడు. వెంటనే విజిలెన్స్ అధికారులు ఏఎస్ఐని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వల పన్నారు. దీనిలో భాగంగా ఏఎస్ఐకు డబ్బులు ఇచ్చేందుకు రింఖస ఒప్పుకోవడంతో, డబ్బును దుప్పట్ల వ్యాపారి మహ్మద్ నజరూల్‌కు ఇవ్వాలని ఏఎస్ఐ సూచించాడు. అక్కడ దుప్పట్ల వ్యాపారికి డబ్బులు ఇస్తుండగా, అప్పటికే మాటువేసి ఉన్న విజిలెన్స్ సిబ్బంది దాడిచేసి దుప్పట్ల వ్యాపారిని అరెస్టు చేశారు. అనంతరం ఏఎస్ఐ నాయక్‌ను పట్టుకున్నారు. అలాగే పట్టణ పోలీసుస్టేషన్‌లోని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసు క్వార్టర్స్‌లోని ఏఎస్ఐ నివాసంలో, నవరంగపూర్‌లోని అతడి ఇంట్లో ఏకకాలంలో దాడులు జరిపినట్లు విజిలెన్స్ ఎస్పీ ప్రత్యుమ్న ద్వివేదీ వెల్లడించారు.

క్లుప్తంగా

నీలమ్మకు విప్లవ జోహార్లు అర్పిస్తూ మావోయిస్టుల లేఖ

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం పెదవంకకు చెందిన సీపీఐ(మావోయిస్టు) ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ తల్లి చెల్లూరి నీలమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమెకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు జోనల్ కమిటీ కార్యదర్శి నేత గణేష్ పేరిట లేఖ విడుదల చేశారు. నీలమ్మ అనేక పోరాటాల్లో పాలుపంచుకుంటూ కుటుంబ సభ్యులను సైతం ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వాములను చేశారని గుర్తు చేశారు. మావోయిస్టులకు వసతి, భోజనాలు కల్పించి అండగా నిలవడంతో పాటు తమకు ఆర్థికంగా కూడా చేయూతనిచ్చారని, నీలమ్మ కోరుకున్న సమసమాజ స్థాపన నెరవేరే వరకు విప్లవ పక్షాన నిలబడతామని గణేష్ పేర్కొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

గార: మండల కేంద్రం గారలోని వేంకటేశ్వర స్వామి, షిర్డీ సాయినాథాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. షిర్డీ ఆలయంలో చెవిదుద్దులు, వెండి వస్తువులు, వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళసూత్రంతో పాటు హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించింది. ఈ ఘటనలపై ఆలయ నిర్వాహకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలకు జశ్వంత్

టెక్కలి: ఈ నెల 24 నుంచి 28 వరకు రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు టెక్కలి ఎస్ఆర్ఆర్ కబడ్డీ క్లబ్‌కు చెందిన దండుపాటి జశ్వంత్ ఎంపికైనట్లు కోచ్ నీలయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు దోని బుజ్జి క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేశారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాము, పీఈటీలు శ్రీనివాసరావు, ప్రకాశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



చెక్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల సాయుధ దళంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ డి.కేశవరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు రూ.లక్ష తక్షణ సాయాన్ని పోలీస్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. భవన నిర్మాణాలు పరిశీలించి అకడమిక్ వ్యవహారాలు, పాలనా అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జీయూకేటీ నాలుగు క్యాంపస్‌లకు నాక్ బీ+ గ్రేడు వచ్చిందని, భవిష్యత్తులో 'ఏ' గ్రేడ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ప్రీ యూనివర్సిటీ రెండేళ్లు, ఇంజినీరింగ్ మూడేళ్లు కలిపి 5500 మంది విద్యార్థులకు వసతి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్‌లకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, గేట్ ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, ఆర్.కె.వ్యాలీ కడప, ఒంగోలు, నూజివీడు క్యాంపస్‌ల్లో 133 కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులు, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏడాది వ్యవధికి నియామకాలు ఉంటాయని, అవసరం బట్టి పొడిగింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, ఓఎస్డీ ఎల్.సుధాకర్ బాబు, డీన్ మోహన్‌కృష్ణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీఈ వెంకటరెడ్డి, వర్సిటీ ఇంజినీర్లు తేజ్‌కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

జగనన్న సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తి

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాలకు రావికంటిపేట మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మంగళవారం క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు జనవరి 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహిక మహిళలకు 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యం



పరిశ్రమ ప్రారంభిస్తున్న మంత్రి సరక, పక్కనే ఎమ్మెల్యే ముదులి



ఉపాధి పొందుతున్న యువతులు



రాగులతో తయారైన బిస్కెట్లు

- ఏర్పాటుకు యువత ముందుకు రావాలి
- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: రాష్ట్రంలో పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యమవుతుందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. సదరు సమితి పరిధి పితామహల్‌లో సుమారు రూ.5.60 కోట్ల వ్యయంతో ముఖ్యమంత్రి కృషి ఉద్యోగ యోజన పథకం కింద ఏర్పాటైన న్యూట్రీ ఆగ్రో ప్రాడక్ట్స్ అనే చిన్నతరహా పరిశ్రమను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలకు చేయూతనిస్తుందన్నారు. రాష్ట్రం ఖనిజ, ప్రాకృతిక సంపదలకు నిలయమని, వీటిని సక్రమంగా వినియోగించుకుంటే ఎంతో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాయగడ జిల్లాలోని ఖనిజ సంపదలు వినియోగించుకోవడంతో గత పదేళ్లలో జిల్లా అత్యంత అభివృద్ధి సాధించిందన్నారు. పారిశ్రామిక జిల్లాగా బాసిల్లుతున్న రాయగడ జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు అనివార్యమన్నారు. భారీ పరిశ్రమల ఏర్పాటుతో వాటి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయని వెల్లడించారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు

పరిశ్రమల ఏర్పాటుతో ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి సరక అన్నారు. యువత చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు. దీంతో మరికొంత మందికి ఉపాధి కలిగించే అవకాశం ఏర్పడుతుందన్నారు.

210 మందికి ఉపాధి అవకాశాలు

పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా ఉన్నటువంటి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని సీఈవో సాహు అన్నారు. ప్రస్తుతం తమ పరిశ్రమలో దాదాపు 210 మందికి ఉపాధి కల్పించామని, త్వరలో పరిశ్రమ అభివృద్ధి దిశలో పయనిస్తే మరో వందమంది వరకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిశ్రమ రీజనల్ కార్యాలయం అధికారి సవ్యసాచి సాహు, వివిధ పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో పరిశ్రమ

జిల్లా పరిసర ప్రాంతాల్లో లభించే ముడి సరుకుకు అనుకూలంగా ప్రభుత్వ ఆర్థిక సహకారంతో న్యూట్రీ ఆగ్రో ప్రాడక్ట్ పరిశ్రమను ఏర్పాటు చేశామని పరిశ్రమ సీఈవో ప్రద్యుమ్న సాహు అన్నారు. ముఖ్యంగా జిల్లాలో లభించే చిరుధాన్యాలు, అదేవిధంగా రాగులను వినియోగించి ఉత్పత్తులను చేస్తున్నామని వివరించారు. స్థానిక మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాలకు కూడా తమ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. రాగులతో తయారైన బిస్కెట్లకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని అభిప్రాయపడ్డారు.

రిలే నిరాహార దీక్షలు

రాయగడ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని స్థానిక ఎడీఎన్ కార్యాలయం వద్ద తూర్పుకోస్తా రైల్వే శ్రామిక సంఘం మంగళవారం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం ఉప సమన్వయకుడు, డివిజనల్ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ పాఢి మాట్లాడుతూ.. అఖిల భారత రైల్వే సమాఖ్య పిలుపు మేరకు ఆందోళన చేపట్టామన్నారు. ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళనలో సంఘం రాయగడ శాఖ కార్యదర్శి బి.మురళీధర్ రెడ్డి, బొబ్బిలి శాఖకు చెందిన ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

భువనేశ్వర్: సిబ్బంది సంక్షేమంపై రైల్వే శాఖ ప్రదర్శిస్తున్న ఉదాసీనతకు నిరసనగా తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్(ఈకోర్సు) రిలే నిరాహార దీక్షలు మంగళవారం చేపట్టింది. విరామం తర్వాత వృద్ధాప్యంలో సాంఘిక, ఆర్థిక భద్రతకు దోహదపడే పాత పింఛన్ వ్యవస్థ పునరుద్ధరణ ప్రధాన డిమాండ్‌గా ఈకోర్సు కార్యకర్తలు ఆందోళనకు దిగారు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని ఆందోళనకారులు తెలిపారు. తూర్పు కోస్తా రైల్వే భువనేశ్వర్ ప్రాంతం సీనియర్ సీడీవో కార్యాలయం, ఏడీఈఎన్ కార్యాలయం, టికెటు తనిఖీ సిబ్బంది కార్యాలయం పరిసరాల్లో రిలే నిరాహార దీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు.



భువనేశ్వర్ రైల్వేస్టేషన్ రిలే దీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సింపోజియం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విదేశీ విజ్ఞానవేత్త కరేన్ హాలిడే

- మొక్కలపై కాంతి ప్రభావంపై చర్చ
- హాజరైన వివిధ దేశాల విజ్ఞానవేత్తలు

భువనేశ్వర్: స్థానిక జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ(నైజర్) పఠాణి సామంత ఆడిటోరియంలో మొక్కల ఫొటో బయాలజీ అంతర్జాతీయ సింపోజియం మంగళవారం ప్రారంభమైంది. మొక్కలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగిస్తున్న విజ్ఞానవేత్తలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. పంట మొక్కల ఎదుగుదల, ఉత్పాదనపై పర్యావరణ ప్రభావం గుర్తించే దిశలో శతాబ్దం కిందట మొక్కల ఫొటో బయాలజీ పరిశోధన అమెరికాలో 1920 సంవత్సరంలో ప్రారంభమైందని కాలిఫోర్నియా ప్లాంట్ అండ్ మైక్రో బయాలజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పీటర్ హెచ్.క్వేల్ తెలియజేశారు. పంట మొక్కల ఎదుగుదల, ఉత్పాదనలో కాంతి ప్రధాన ప్రభావిత అంశమని పేర్కొన్నారు. విత్తన అంకురోత్పత్తి, మొలకల అభివృద్ధి, పూత ఇతరేతర దశల్లో పంట మొక్కలపై కాంతి ప్రభావాన్ని విశ్లేషించే దిశలో పలు కీలక అంశాలను ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న నైజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిరేంద్రనాథ్ ఘోష్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ క్రిస్టియన్ ఫ్రాంకజర్

కాంతి ప్రభావంపై అధ్యయనం

పంట మొక్కలపై కాంతి ప్రభావాన్ని లోతుగా అధ్యయనం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు సదస్సుకు విచ్చేయడం గర్వకారణమని స్థానిక నైజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిరేంద్రనాథ్ ఘోష్ పేర్కొన్నారు. మానవాళి మనుగడ, పురోగతికి దోహదపడే పలు రకాల పరిశోధనలకు నైజర్ వేదికగా నిలుస్తోందని వెల్లడించారు. ఇక్కడ వివిధ విజ్ఞాన సంబంధిత కోర్సుల్లో 1,500 మంది పైబడి విద్యార్థులు, 120 మంది అధ్యాపకులు, శాస్త్రీయ అధికారులతో శక్తివంతమైన విద్యా సంస్కృతిని విస్తరిస్తోందన్నారు.

వెలుగులోకి పరిశోధనాత్మక అంశాలు

వ్యవసాయ రంగంలో తలెత్తే విభిన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు దోహదపడే పరిశోధనాత్మక అంశాలు ఈ సదస్సులో వెలుగులోకి రానున్నాయని జర్మనీ కలోన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉటే హెకరు తెలిపారు. ప్రపంచవ్యాప్త విజ్ఞానవేత్తలతో కొనసాగే ఈ సదస్సు సుసంపన్నమైన అనుభవం నేటితరం విజ్ఞానవేత్తలకు ప్రేరణాత్మకం అవుతుందని ఐజర్ భోపాల్ ప్రొఫెసర్ సౌరవ్ దత్త తెలిపారు. విదేశాల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు పరిశోధనాత్మక సైన్స్ నేర్చుకోవడంతో పాటు భారతీయ సంస్కృతిని నేర్చుకోవడం భావి జీవితంలో మంచి జ్ఞాపకాలను మిగిల్చేందుకు ఈ సదస్సు తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుందన్నారు. మొక్కల ఫొటో బయాలజీ రంగంలో వివిధ అంశాలు, ప్రస్తుత పోకడలపై వైజ్ఞానికులు తమ అనుభవాల్ని పంచుకుంటారని కన్వీనర్ నైజర్ ప్రొఫెసర్ కిషోర్ పాణిగ్రాహి తెలిపారు. ఎంబో ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల ఫొటో బయలాజీ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో స్విట్జర్లాండ్ విజ్ఞానవేత్త ప్రొఫెసర్ క్రిస్టియన్ ఫ్రాంకజర్ ముఖ్య అతిథిగా, జర్మనీ కలోన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కరేన్ హాలిడే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.



నైజర్ విద్యార్థుల గీతాలాపన

గణతంత్ర వేడుకలకు సన్నాహక సమావేశాలు



పర్లాకిమిడి: సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు పోటీలు, జనవరి 21వ తేదీ నుంచి 23 వరకు స్టేడియంలో పరేడ్ ప్రాక్టీసు, జనవరి 26న ఉదయం 4.30 గంటలకు రామ్‌ధూన్ జరపాలని నిర్ణయించారు. వేడుకులకు రోడ్లు, భవనాల శాఖ తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, ఓఎస్ఏపీ 3వ బెటాలియన్ కమాండెంట్ అశోక్ కుమార్ మహంతి, డీపీఆర్వో ప్రదిప్త గురుమయి, జిల్లా సాంస్కృతిక అధికారి కుమారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.




జయపురం: సన్నాహక సమావేశంలో పాల్గొన్న అధికారులు

జయపురం: స్థానిక మున్సిపల్ సభాగృహంలో సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ అధ్యక్షతన గణతంత్ర దినోత్సవ సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వేడుకలను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. దసరా పోడియాలో నిర్వహించే వేడుకల్లో భాగంగా సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఎగురవేస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించే పరేడ్‌లో 57 గ్రూపులు పాల్గుంటాయని తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, బీడీవో శక్తి ప్రసాద్ మహాపాత్రో, పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో, సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు






ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ ప్రధాన రహదారి వద్ద రైల్వే స్థలంలో ఉన్న ఇళ్లను అధికారులు మంగళవారం తొలగించారు. పోలీసు బందోబస్తులో బీడీవో, తహసీల్దార్‌ల సమక్షంలో రైల్వే అధికారులు ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారు. జేసీబీలో సాయంతో సుమారు 100 ఇళ్లను తొలగించారు. ఇక్కడ ఆక్రమణలు తొలగించాలని ఇదివరకే రైల్వే శాఖ నోటీసులు జారీ చేసింది. ఇచ్చిన గడువు ముగియడంతో తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.


విజయస్థూపం సాక్షిగా ప్రజారంజక పాలన



విజయస్థూపం వద్ద కేక్ కట్ చేస్తున్న సాయిరాజ్, రామారావు

ఇచ్ఛాపురం రూరల్: జనం గుండెచప్పుడు వింటూ.. దగా పడ్డ ప్రజల కన్నీళ్లు తుడుస్తూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ విజయస్థూపం సాక్షిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర తుది ఘట్టానికి మంగళవారంతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద నిర్మించిన విజయస్థూపం వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి టీడీపీ చీకటి పాలన నుంచి ప్రజల్ని విముక్తులను చేసేందుకు జగనన్న చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు కోట్లాది మంది ప్రజలు జేజేలు పలికారని, బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్నదాతలను అక్కున చేర్చుకొని నవరత్నాల పథకాల ద్వారా 98.8 శాతం హామీలు నెరవేర్చి జనం మదిలో నిలిచిపోయారని వివరించారు. మరో 30ఏళ్ల వరకు ప్రజలంతా తమ వెంటే ఉంటూ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, వి.మృత్యుంజయరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుప్పలు దగ్ధం




సీతంపేటలో కాలిపోయిన ధాన్యం

జి.సిగడాం: మండలంలోని సీతంపేటలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. వరి కుప్పలు ఆడుతున్న యంత్రం ద్వారా నిప్పురవ్వలు చెలరేగడంతో కల్లంలో ఉన్న మిగిలిన కుప్పలకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో శాసపు సత్యానికి చెందిన 6 ఎకరాల వరి గడ్డి, 20 బస్తాల ధాన్యం, లెంక సన్యాసికి చెందిన 40 బస్తాల ధాన్యం, శాసపు పాపినాయుడుకు చెందిన 3 ఎకరాల ధాన్యం, కుప్పలు కాలిబూడిదయ్యాయి. నాలుగు నెలల పడిన కష్టమంతా బుగ్గిపాలైందని రైతులు విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల విలువైన ధాన్యం కాలిపోయాయని బాధితులు తెలిపారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎంఈవోల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ:

మండల విద్యా శాఖాధికారుల(ఎంఈవో) సంఘం జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. శ్రీకాకుళంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఈవో-1, ఎంఈవో-2లు సంయుక్తంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఒకే సంఘంగా ఏర్పాటయ్యారు. జి.సిగడాం ఎంఈవో ఎ.రవి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. శ్రీకాకుళం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘ అధ్యక్షునిగా జె.చిన్నవాడు (సంతబొమ్మాళి), ప్రధాన కార్యదర్శిగా పి.దాలినాయుడు (నరసన్నపేట), కోశాధికారిగా యు.శాంతారావు (నరసన్నపేట), రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.పున్నయ్య (ఎచ్చెర్ల), గౌరవాధ్యక్షుడిగా జి.రాజేంద్రప్రసాద్ (ఆమదాలవలస), ఉపాధ్యక్షులుగా కె.రాంబాబు (హిరమండలం), సీహెచ్.తిరుమలరావు (పాతపట్నం) ఎన్నికయ్యారు. శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శిగా ఎం.మురళీకృష్ణ (లావేరు), టెక్కలి డివిజన్ కార్యదర్శిగా జి.చిన్నారావు (టెక్కలి) ఎన్నికయ్యారు. జిల్లాలోని 30 మండలాల నుంచి 58 మంది ఎంఈవోలు హాజరయ్యారు.



నూతన కార్యవర్గ ప్రతినిధులు

క్లుప్తంగా

అనాథకు 'ఆధార్'ం



పెన్షన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లిలో పూర్వీకులు నివాసముండేవారు. చాలా ఏళ్ల క్రితం కుటుంబం విచ్ఛిన్నం కాగా ఊరొదిలి వెళ్లపోయి ఆరునెలల క్రితం మళ్లీ ఊర్లోకి వచ్చిన పేరు లావేటి బ్రహ్మాజీరావు అనాథలా కొన్ని నెలలుగా రామమందిరం గడపలో పడుకుంటున్నాడు. సరిగా మాటలు కూడా రావు. అయితే స్థానిక వాలంటీర్ తామాడ ఆనందరావు బ్రహ్మాజీరావును గుర్తించి స్థానికులతో మాట్లాడి ఆధార్ కార్డు చేయించి పెన్షన్‌కు అప్లై చేశాడు. వెంటనే అతనికి రైస్ కార్డు, పెన్షన్‌కూడా మంజూరైంది. ఈ క్రమంలో బ్రహ్మాజీ రావుకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు చేతుల మీదుగా మంగళవారం పెన్షన్ డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనతోనే మానవత్వం, సంక్షేమం ప్రారంభమైందన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కనిపించకుండా కుటుంబం విచ్ఛిన్నమైన తరువాత గ్రామంలోకి వచ్చి రామమందిరంపై పడుకుంటున్న వ్యక్తికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వలంటీర్ ఆనంద్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మున్సిపల్ చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌బీకేలో చోరీ



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏవో అనూరాధ

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఆర్‌బీకేలో గుర్తు తెలియని వ్యక్తులు టీవీని చోరీ చేసినట్లు ఏవో అనూరాధ మంగళవారం తెలిపారు. ఆర్‌బీకే తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టి టీవీతో పాటు కంప్యూటర్ పరికరాలను ఎత్తుకెళ్లడంతో పెదమానాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

1700 సారా ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం అడ్డూరు వలస గ్రామ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో 1700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి సారా రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి అడారు గ్రామానికి చెందిన మండంగి శ్రీరాములు సారా ప్యాకెట్లు రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. దాడుల్లో ఎస్సై రమణ, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

29 మద్యం సీసాల స్వాధీనం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 29 మద్యం సీసాలను ఏఎస్సై గోవిందరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామం సమీపంలో గల మద్యం దుకాణం నుంచి వేపాడ మండలంలోని కుంపల్లి గ్రామానికి చెందిన డెక్క నాయుడు మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గోవిందరావు తెలిపారు.

2.5 లీటర్ల సారా..

కొత్తవలస: మండలంలోని తమ్మన్నమెరక గ్రామం సమీపంలో సారా అమ్ముతుండగా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దగ్గర 2.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కొత్తవలస న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

పాచిపెంట: భార్య మందలించిందని పురుగు మందు తాగిన వ్యక్తి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు, మండల కేంద్రానికి చెందిన దాసరి అప్పన్న(52) రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో ఈనెల 7వ తేదీన భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగేశాడు. వెంటనే కుటుంబసభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

నూర్పిడి చేసిన వెంటనే...

- జోరుగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు జిల్లాలో 2.50 లక్షల టన్నులు కొనుగోలు
- 493 ఆర్‌బీకేల ద్వారా 61,788 మంది రైతుల నుంచి మిల్లులకు తరలింపు
- ప్రతీ మిల్లు వద్ద కస్టోడియన్‌ల సేవలు
- 80,260 కూపన్ల ద్వారా ధాన్యం సేకరణ



ధాన్యం బస్తాల నుంచి శాంపిల్స్ తీస్తున్న సిబ్బంది, రైతులు

బొబ్బిలి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నూర్పిడి చేసిన వెంటనే రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లులకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 493 ఆర్‌బీకేల పరిధిలో ఇప్పటివరకు 2.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బులు గత నెల 24 వరకూ జమయ్యాయి. మిగిలిన వారికి ఈ వారంలోనే చెల్లింపులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాలకు డబ్బులు జమచేయాలి. కానీ ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయించిన రెండువారాల్లోపలే ధాన్యం బిల్లులను చెల్లిస్తున్నారు. క్వింటాకు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203లు, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున రైతులకు మద్దతు ధర అందుతోంది.

లెక్క పక్కాగా...

జిల్లాలో ఉన్న ఆర్‌బీకేల నుంచి తరలిస్తున్న ధాన్యం లెక్కలు సరిచూసేందుకు ప్రతీ మిల్లు వద్ద ప్రభుత్వ అధికారులను కస్టోడియన్లుగా నియమించారు. దీంతో వచ్చిన ధాన్యం ఎంత ? అన్లోడ్ చేసిన ధాన్యమెంత? ఆలస్యం లేకుండా వెంటనే డౌన్‌లోడ్ చేయించడం, రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడంతో కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

నిరంతర పర్యవేక్షణ

రైతుల నుంచి సేకరించిన ధాన్యం సక్రమంగా కొనుగోలు కేంద్రాలకు చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చాం. దీనివల్ల వెంటవెంటనే సమాచారం వస్తోంది. నిత్యం పర్యవేక్షణ చేయడం ద్వారా జిల్లాలోని అన్నిప్రాంతాల్లో కంటే బొబ్బిలి నుంచి ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశాం. త్వరగా కొనుగోలు పూర్తిచేసి రైతులకు వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం.

– మజ్జి శ్యామ్‌సుందరరావు, అగ్రికల్చరల్ ఏడీ, బొబ్బిలి

వెంట వెంటనే కూపన్లు జారీ..

రైతులు ఆర్‌బీకేలకు తరలించిన ధాన్యానికి ఆపరేటర్లు వెంటనే రైతులకు చెందిన ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్‌లను అప్‌లోడ్‌చేసి కూపన్లు జారీచేస్తున్నారు. దీనివల్ల రైతులకు సకాలంలో నగదు వారి వ్యక్తిగత ఖాతాలకు జమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 80,260 కూపన్లు జారీ చేసి ధాన్యం సేకరించారు.

బొబ్బిలిలో అత్యధికం

జిల్లా వ్యాప్తంగా 2.50లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేపట్టగా, బొబ్బిలి నియోజకవర్గంలోని రైతులు అధికమంది నూర్పిడిచేయడంతో ధాన్యం విక్రయంలో ముందున్నారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లోని 11,383 మంది రైతుల నుంచి 47,963.52 టన్నుల ధాన్యాన్ని సోమవారం నాటికి కొనుగోలు చేశారు. ట్రక్ షీట్ల నమోదు జరుగుతూనే ఉంది.



రైతులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడీ శ్యామ్‌సుందరరావు

జిల్లాలో పంజాబ్ మీడియా బృందం పర్యటన

విజయనగరం అర్బన్: భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల పరిశీలన నిమిత్తం పంచాబ్‌కు చెందిన మీడియా ప్రతినిధుల బృందం మంగళవారం విజయనగరం జిల్లాలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం అందిస్తున్న తరగతులు, ఏయే కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది? గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ విద్యాలయం ఎంత వరకు దోహదపడుతుంది. ప్రధానంగా విదేశీ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారా? ఇతర సేనా కార్యక్రమాల నిర్వహణపై ఆరా తీశారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను తమ పత్రికల్లో కథనాలుగా ప్రచురించనున్నట్లు మీడియా ప్రతినిధుల బృందం సభ్యులు దల్బీర్‌సింగ్, రొగిస్ సోది వెల్లడించారు. వారికి కళాశాల నిర్వహణ తీరు, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్, కళాశాల ఏఓ ఎన్ వీసూర్యనారాయణ, చిన్నారావు తదిరులు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంకల్పంతో 2019లో ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయంలో ప్రధానంగా 14 కోర్సులను అందిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలియజేశారు. సుమారు 200 మంది ప్రస్తుతం ఇక్కడ చదువుతున్నారని తెలిపారు. నేషనల్ టాలెంట్ ఎగ్జామినేషన్ ద్వారా జాతీయ స్థాయిలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నామని, దాదాపు ఏడాది కాలంలో సొంతభవనాలకు తరలిస్తామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో సుమారు 14 మంది ఉపాధి అవకాశాలు పొందారని తెలిపారు. ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి తారకప్రసాద్, విజయవాడకు చెందిన పత్రికా సమాచార కార్యాలయ ప్రతినిధి హెన్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన యూనివర్సిటీ అధికారులతో పంజాబ్ మీడియా బృందం

స్పైమార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ

- మూడు గోల్డ్‌మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించిన కొత్తవలస క్రీడాకారులు



గోల్డ్‌మెడల్స్ సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు త్రినాథ్‌రావు

కొత్తవలస: రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 24వ జాతీయ స్పైమార్షల్ ఆర్ట్స్‌లో కొత్తవలస మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈ మేరకు శిక్షకుడు ఎం.త్రినాథ్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 24వ జాతీయ స్పైమార్షల్ ఆర్ట్స్ పోటీల్లో దేశం మొత్తంగా 17 వందల మంది, కొత్తవలస మండలానికి చెందిన 11మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వారిలో ఎం.నీలాంజినప్రసాద్(గోల్డ్‌మెడల్), ఎన్.లలితాకామేశ్వరి (గోల్డ్, సిల్వర్ మెడల్స్),ఎన్.కుసుమాశ్రీ (గోల్డ్,బ్రాంజ్ మెడల్స్),వై.వెంకటలక్ష్మి(సిల్వర్ మెడల్), పి.కరిష్మా(సిల్వర్ మెడల్),మాధవరావు, టి.దీపిక, సీహెచ్.అనూష, జె.శ్రీజ, కె.తేజలు బ్రాంజ్ మెడల్స్ సాధించారని శిక్షకుడు తెలిపారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రేణుకా కల్యాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.రేణుకా కల్యాణి యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. విశాఖపట్నంలోని బుల్లయ్య కళాశాలలో ఈనెల 8న జరిగిన పోటీల్లో 84 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని కళాశాల అధ్యాపక సిబ్బంది కమలాకర్‌రావు, బి.రవి, పీడీ.బి.శ్రీనివాసరావు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వీరఘట్టం:

మండలంలోని విక్రమపురం గ్రామంలో గల వావిలపల్లి వెంకటనాయుడుకు చెందిన ఇటుక బట్టీలో మంగళవారం ఉదయం ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ముచ్చి వంశీ(20) అక్కడికక్కడే మృతిచెందాడు. నాలుగేళ్లుగా తల్లిదండ్రులు సింహాచలం, గౌరీశ్వరిలతో కలిసి ఇదే బట్టీలో ఇటుకలు తయారీ చేస్తూ, ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు.ఇటుకల తయారీ కోసం కావాల్సిన మట్టిని వీల్ ట్రాక్టర్‌తో బాగా దుక్కిపట్టి తర్వాత ఆ మట్టితో ఇటుకలు తయారు చేస్తారు. ప్రతిరోజూ ఉదయాన్నే ఇలా వీల్ ట్రాక్టర్‌తో మట్టిని దుక్కిపడతారు. ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం 7.30 గంటలకు మట్టిని దుక్కిపట్టేందుకు వీల్ ట్రాక్టర్‌ను వంశీ డ్రైవింగ్ చేశాడు. ఈ క్రమంలో సర్కిల్‌లో రౌండ్లు తిరుగుతుండగా ఒక్కసారిగా వీల్‌ట్రాక్టర్ బోల్తా పడగా ట్రాక్టర్ క్రింద డ్రైవర్ వంశీ ఉండిపోయి ఊపిరాడక క్షణాల్లో ప్రాణాలు విడిచాడు. వెంటనే జేసీబీ సాయంతో వీల్ ట్రాక్టర్‌ను పక్కకు నెట్టి వంశీని బయటకు తీశారు. అప్పటికే చనిపోవడంతో మృతదేహాన్ని స్వగ్రామం కడకెల్లకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం.గోవింద తెలిపారు.



డ్రైవర్ వంశీ మృతదేహం

ట్రాక్టర్‌పై నుంచి పడి మరొకరు..

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి సమీపంలో ట్రాక్టర్‌తో వెళ్తున్న చొక్కాపు వాసు (33) వ్యక్తి ట్రాక్టర్‌పై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలాఉన్నాయి. బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన చొక్కాపువాసు ఉత్తరావల్లి గ్రామంలో బంధువుల వ్యవసాయపనుల నిమిత్తం సోమవారం ట్రాక్టర్‌ను తీసుకువచ్చాడు. ఆ పనులు ముగించుకుని మంగళవారం తిరిగి తన గ్రామానికి బయలుదేరి వెళ్తుండగా ఉత్తరావల్లి గ్రామం సమీపంలోనే ఏం జరిగిందో తెలియదు కానీ ట్రాక్టర్ రోడ్డుపక్కన పడి ఉంది. డ్రైవింగ్ చేస్తున్న వాసు ట్రాక్టర్ పడిపోయిన ప్రదేశానికి కొన్ని అడుగుల ముందు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతునికి భార్య అనసూయ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు బుదరాయవలస ఎస్సై సీహెచ్ నవీన్‌పడాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మెరకముడిదాం: వాసు మృతదేహం

చెరువులో పడి మహిళ..

భోగాపురం: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న చెరువులో పడి ఓ మహిళ మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురానికి చెందిన పాండ్రంగి కొండమ్మ(53) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం వేకువజామునే లేచి కాలకృత్యాలకని చెప్పి సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న చెరువు వద్దకు ఆమె వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులోపడి మృతిచెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి భర్త కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై టీఎస్ఎన్ రాజు తెలిపారు.

బైక్ ఢీకొని యువకుడు..

రామభద్రపురం: మండలకేంద్రంలో బైపాస్ రోడ్డు వద్ద స్కూటీని బుల్లెట్ ఢీకొనడం ఓ యువకుడు మంగళవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని పెదపల్లి వీధికి చెందిన పెదపల్లి భాస్కరరావు(27) మంగళవారం ఉదయం పని నిమిత్తం బైపాస్ జంక్షన్‌కు స్కూటీపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఇంతలో విశాఖపట్నానికి చెందిన వ్యక్తులు ఒడిశా నుంచి మితిమీరిన వేగంతో బుల్లెట్‌పై విశాఖపట్నం వెళ్లిపోతూ లారీని క్రాస్ చేస్తుండగా స్కూటీని బలంగా ఢీకొట్టాడు. దాంతో స్కూటీపై ఉన్న భాస్కరరావు తుళ్లిపోయి డ్రైనేజీ కోన్‌కు తలతగిలి తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రుడిని స్నేహితులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం చేశారు. మృతుడి భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు ఏఎస్సై చిన్నయ్య కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



భాస్కర రావు మృతదేహం

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



రాజాం: పార్టీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, పార్టీ నేతలు

రాజాం: పట్టణంలోని డోలపేట గ్రామానికి చెందిన పలువురు నాయీబ్రాహ్మణులతో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన మరికొన్ని కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ మేరకు మంగళవారం వారిని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన రాయవరపు అప్పారావు, గోవింద, కొమరిగిరి వెంకన్న, రాయవరపు శ్రీనులతో పాటు మరో పదిహేను కుటుంబాలు పార్టీలో చేరాయని తలే రాజేష్ వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై వారంతా పార్టీలో చేరుతున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గంలో ఓటింగ్ అంతా వైఎస్సార్‌సీపీకే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, గోకవలస బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి
- ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీజీఈఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ రంగ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి ఆశాఖ లక్ష్యాలను సాధించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు నిర్దేశిత కాలంలోనే ఉద్యోగులు సేవలను అందించాలని సూచించారు. విధుల సమయంలో చేసిన మంచిపనులు పదవీవిరమణ అనంతరం సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీయుగంధర్, జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి కంది వెంకటరమణ, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్‌కుమార్, సంఘం అర్బన్ కమిటీ అధ్యక్షుడు బి.బాలభాస్కరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, కృష్ణ, సూర్యనారాయణ, వై.ధనుంజయ్‌కుమార్, రంభ జ్యోతి, సురేష్, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పాకలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

శృంగవరపుకోట: పట్టణంలోని చెరుకు కాటా వద్ద గెడ్డ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి కొద్ది రోజుల క్రితం పాకలు వేసిన విషయంలో పోలీసుల సహకారంతో మంగళవారం వాటిని రెవెన్యూ అధికారులు తొలగించారు. గెడ్డస్థలం ఆక్రమించి పాకలు నిర్మించడం చట్టరీత్యా విరుద్ధమని ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని వారు దరఖాస్తు ఇస్తే తగిన దర్యాప్తు చేసి స్థలాలు కేటాయిస్తామంటూ గతంలో తహసీల్దార్ బి.శ్రీనివాస రావు చెప్పినా ఆక్రమణదారులు పట్టించుకోలేదు. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం చర్యలకు ఉపక్రమించి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన పాకలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగించారు. ఇదే సమయంలో తమకు పరిహారం ఇప్పించాలని ఆక్రమణదారులు ఆందోళన చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పాకలు ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి బెదిరించే ప్రయత్నం చేయడం తగదని మీరు ఏర్పాటు చేసుకున్న పాకలకు ప్రభుత్వం ఎందుకు పరిహారం చెల్లిస్తుందని ప్రశ్నించారు. ఇకపై ప్రభుత్వ స్థలంలో తగిన అనుమతులు లేకుండా ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రైల్వేలో ఓపీఎస్ అమలుకు డిమాండ్

విజయనగరం టౌన్: రైల్వేలో పాత పెన్షన్ విధానాన్నే అమలుపరచాలని ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ చక్రవర్తి (భువనేశ్వర్) కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈస్టుకోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో విజయనగరం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టుకోస్టు రైల్వేలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) విధానాన్ని కొనసాగించాలని జోన్ మొత్తం నిరసన చేపట్టామన్నారు. 8, 9, 10 తేదీల్లో నిరసన తెలుపుతామని, 11న అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి విశాఖలో డీఆర్ఎమ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. న్యూ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానంలో రిటైరైన తర్వాత వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తారని, ఇప్పటివరకూ దానిపై ఎటువంటి హామీలివ్వలేదన్నారు. అదే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తే రిటైరైన తర్వాత పింఛన్ ఉంటే అతనికి, తర్వాత భార్యకు, వారి కుటుంబీకులకు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ కె.వి.లక్ష్మణరావు, అప్పలరాజు, నాగేశ్వరరావు, జి.ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, నారాయణరావు, రాంబాబు, ప్రసాద్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.